తడిసిన ధాన్యం

భారీ వర్షానికి తడిసిన ధాన్యం

- వలిగొండలో ఇళ్లలోకి చేరిన నీరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం భారీ వర్షం కురవడంతో పలు మండలాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. పంట పొలాల్లోకి, ఇండ్లలోకి నీరు వచ్చి చేరింది. మూసీ పొంగిపొర్లుతోంది. మూసీ పరివాహక ప్రాంతంలో రాకపోకలు బంద్ అయ్యాయి. వలిగొండ మండలంలో కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వలిగొండ, భువనగిరి, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, మోత్కూరు, బిబినగర్, మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది.

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సమావేశాలు సూచనలకే పరిమితమైంది. నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. ముందస్తుగా పంట చేతికొచ్చిన వారు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలు పోశారు. వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం వచ్చినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఆదివారం ఉదయం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు తప్ప జిల్లాలో కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పలేదు. ఈ క్రమంలో భారీ వర్షం పడటంతో ధాన్యం మొత్తం తడిసిముద్దయింది. రైతులు లబోదిబోమంటున్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎమ్.డి.జహంగీర్ వర్షం కారణంగా నష్టపోయిన పంటలను అధికారులు వెంటనే పరిశీలించి పరిహారం చెల్లించాలి. కేంద్రాలు ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి. రామన్నపేట, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చింది. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి.

కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కొత్త మద్యం పాలసీపై సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుం పెట్టారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. లాటరీలో షాపు దక్కకపోతే రూ.3 లక్షలు అబ్కారీ శాఖకే వెళ్తాయని.. డబ్బును తిరిగిచ్చేలా ఆ శాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. లిక్కర్ పాలసీపై జారీ చేసిన జిఒను కొట్టివేయాలని కోరాడు. దీనిపై ఆబ్కారీశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

ఎక్సైజ్ శాఖకు 97 మంది ఎస్ఐలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎక్సైజ్ శాఖకు గ్రూపు టూ ద్వారా 97 మందిని ఎస్సైలుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరిలో వరంగల్ మల్టీ జోన్ వన్‌కు 63 మందిని, హైదరాబాద్ మల్టీ జోన్ టూకు 34 మందిని కేటాయించారు. ఎస్సైలుగా ఎంపికైనా వారి సర్టిఫికెట్లను సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో పరిశీలించారు. హైదరాబాద్ మల్టీ జోన్ టూకు 34 మందిని గ్రూపు 2 ద్వారా ఎస్ఐలుగా ఎంపిక చేయగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం 33 మంది హజరయ్యారని హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. వరంగల్ మల్టీ జోన్ వన్‌కు 63 మందిని కేటాయించగా అందరూ వేరిఫికేషన్‌కు హజరయ్యారని వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు తెలిపారు.

మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశం

- పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశమని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఇది తమ కుటుంబంలోని సమస్యని, తామే పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. సమాచారలోపం వల్లే మంత్రుల మధ్య వివాదాలు తలెత్తాయన్నారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సోమవారం ఢిల్లీలో ఆయన పరామర్శించారు. ఇటీవల ఖర్గేకు వైద్యులు పేస్‌మేకర్ అమర్చిన సంగతి తెలిసిందే. ఖర్గేతో భేటీ అనంతరం మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే సహ ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలను ఆయనకు వివరించినట్లు తెలిపారు. త్వరలోనే హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేయనున్నట్లు వివరించారు.

సంక్షేమ హాస్టళ్లకు రూ.60 కోట్లు

- విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నిషన్
- వైద్య కళాశాలలతో హాస్టళ్లకు లింక్
- సంక్షేమ వసతి గృహాల సమీక్షలో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. ఈ హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసిసిసిలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపునకు ఏర్పాట్లు చేయాలని సిఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా, జవాబుదారీతనం ఉండాలని చెప్పారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫారాలు, పుస్తకాలు సకాలంలో అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధారించాలని సిఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సిఎం ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సిఎం అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సిఎం ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, నిర్మాణంతోపాటు ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ వ్యయం, బకాయిల చెల్లింపునకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని సిఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సిఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ఆదేశించారు.

సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ, వికలాంగుల శాఖల అధికారులు జ్యోతి బుద్ధప్రకాష్, బి.షఫియుల్లా, అనితా రామచంద్రన్, క్షితిజ, నిర్మల, క్రాంతి, వెస్లీ, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలి

- బెస్ట్ అవెలబుల్ స్కీం బాధిత పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుకుంటున్న విద్యార్థుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా బెస్ట్ అవైలబుల్ స్కీం బాధిత పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా నిజామాబాద్‌లోని పాత కలెక్టరేట్ నుంచి ఎన్‌టిఆర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి... అక్కడ మానవహారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ధర్నా వద్ద స్కీమ్ పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు బొర్రా నాగరాజు మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించేందుకు 25 సంవత్సరాల క్రితం బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌ను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ప్రస్తుతం స్కీం కింద చదువుకుంటున్న విద్యార్థులకు ఇవ్వాల్సిన నిధులను మూడేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రూ.220 కోట్లు ప్రయివేటు పాఠశాలలకు బకాయి పడిందని అన్నారు. దళిత, గిరిజన, విద్యార్థి సంఘాలు ఏడాది కాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా.. ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోవడంతో ఈ పథకంలోని విద్యార్థులకు విద్యతో పాటు భోజనం, వసతి కల్పించలేకపోతున్నామని ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తూ అక్టోబర్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించేంతవరకూ ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులను పాఠశాలల్లోకి అనుమతించకపోవడంతో పాఠశాలల బయటే పిల్లలు, వారి తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మంది దళిత, గిరిజన విద్యార్థులు చదువుకు దూరమై రోడ్డున పడ్డా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీసం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత, గిరిజన ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎమ్మెల్సీ, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయకపోతే భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కాగా, వీరికి పలు పార్టీలు, విద్యార్థి సంఘాలు మద్దతు తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, బిఎస్‌పి ఇసి మెంబర్, అడ్వకేట్ ఈశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, ఎన్‌సిపి జిల్లా కార్యదర్శి విట్టల్ నాయక్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, ఎఐపిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు బోడ అనిల్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, డిఎస్‌ఎఫ్ జీవన్ బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సిరివెని సంతోష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు విజయకుమార్, విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మారెడ్డి మృతికి సిఎం సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతిపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు ఎన్ఎస్ఎస్ వార్తా ఏజెన్సీ స్థాపకుడిగా, శాసన సభ్యుడిగా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్‌గా ఆయన సేవలందించారని కొనియాడారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు సిఎం తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొండా లక్ష్మారెడ్డి మృతిపె సంతాపం తెలిపారు.

ఎన్ఎస్ఎటికి విశేష స్పందన

- నారాయణ విద్యా సంస్థ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రతిష్టాత్మకమైన నారాయణ స్కాలస్టిక ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎన్ఎస్ఏటీ)-2025కు విద్యార్థుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల కోర్ కమిటీ సభ్యురాలు రమా నారాయణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత 19 ఏండ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల ఐదు నుంచి 12 వరకు నిర్వహించిన ఈ పరీక్షకు తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులు వారి ప్రతిభను, విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఈ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.కోటి వరకు బహుమతులతోపాటు రూ.50 కోట్ల వరకు స్కాలర్‌షిప్‌లను అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి సాధికారత కల్పించడమే తమ సంస్థ లక్ష్యమని వివరించారు.

11 నగరాల్లో ట్రైబ్‌వైబ్ 'కార్తిక్ లైవ్'

హైదరాబాద్ : దక్షిణాదిలోని 11 ప్రధాన నగరాల్లో 'కార్తిక్ లైవ్'ను నిర్వహించనున్నట్లు ట్రైబ్‌వైబ్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. తిరుపతి, వరంగల్, వైజాగ్, కోయంబత్తూర్, కొచ్చిన్, రాజమండ్రి, బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, చెన్నయ్ మధురైలో గాయకుడు కార్తీక్ లైవ్‌తో అభిమానులకు లైవ్ మ్యూజిక్ మాయాజాలాన్ని అందించనున్నట్లు పేర్కొంది. నవంబర్ 30 నుండి ప్రారంభమయ్యే ఈ షో టికెట్లు బుక్‌మైషోలో అందుబాటులో ఉంటాయని తెలిపింది.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మునుగోడులో మద్యం అమ్మకాల్లో రాజన్న రూల్స్!

- అలా అయితేనే దరఖాస్తు చేసుకోవాలి
- మద్యపాన నిషేధమే ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి లక్ష్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిబంధనలు పాటించేలా అయితేనే లిక్కర్ దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి. మునుగోడు రూల్స్ రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీతో సంబంధం లేదంటూ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఇంటి పెద్ద మద్యానికి బానిసలై కుటుంబాన్ని పట్టించుకోక అనారోగ్యం పాలై అర్ధాంతరంగా మరణించడంతో ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. నియోజకవర్గంలో రెండేళ్లుగా బెల్ట్ షాపులను నిషేధించి.. సమయపాలన పాటించడం, సిండికేట్లను నిరోధించడం వంటి నిబంధనలను మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అమలు పరుస్తున్నారన్నారు. కొత్తగా వైన్స్‌షాపులకు ప్రభుత్వం దరఖాస్తు కోరిన నేపథ్యంలో దరఖాస్తు చేసుకునేవారు కూడా తమ నిబంధనలు పాటించాలని, షాపు తీసుకున్న తర్వాత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు తమ నియోజకవర్గంలో పాటించొద్దంటూ లిక్కర్ వ్యాపారులకు, అధికారులకు హెచ్చరిక చేశారు. రాజన్న రూల్స్ మాత్రమే పాటించాలన్నారు. వైన్‌షాప్స్ నిర్వాహకులు ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మాలని, మండలానికి చెందిన స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలని సూచించారు. వైన్స్‌షాపుకు అనుబంధంగా (సిట్టింగ్) పర్మిట్ రూమ్ ఉండొద్దన్నారు. ముఖ్యంగా బెల్ట్ షాపులకు మద్యం అమ్మొద్దని, లాటరీ విధానంలో వైన్స్‌షాప్‌లు దక్కించుకున్న ఓనర్స్ సిండికేట్ కాకూడదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మునుగోడు జెడ్‌పిటిసి నారబోయిన రవి, మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడ మండలాల నాయకులు పల్లె వెంకన్న, కత్తి రవీందర్‌రెడ్డి, పూల వెంకటయ్య, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, జూనియర్ రఘుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దోటి వెంకటేష్‌యాదవ్, చంద్రశేఖర్‌గౌడ్, సత్యం ఉన్నారు.

కారు రావాలా? బుల్డోజర్ కావాలా?

- కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కారు రావాలా? బుల్డోజర్ కావాలా? ఓటర్లు నిర్ణయించుకోవాలని, హైడ్రా రద్దు కావాలంటే జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ ఎస్‌పి ఆర్‌హిల్స్‌లోని గ్రౌండ్‌లో కెటిఆర్ అధ్యక్షతన సోమవారం బిఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ విజయానికి కసి, పట్టుదల, తపన అవసరమని, ధైర్యంతో ముందుకు సాగాలని అన్నారు. దివంగత మాగంటి గోపీనాథ్ ఆడబిడ్డలకు చిరు కానుకలు ఇచ్చి ఆదుకున్నారని చెప్పారు. ఆ కుటుంబానికి అండగా నిలవడం అందరి బాధ్యత అన్నారు. రేవంత్ పాలనపై ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలని, కాంగ్రెస్ మోసపూరిత పాలన బాకీ కార్డులను పంచాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 6 గ్యారంటీలు అమలు కావాలన్నా, వృద్ధులకు రూ.4000 పెన్షన్ రావాలన్నా.. మాగంటి సునీత గోపీనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జూబ్లీహిల్స్‌లో కొట్టే దెబ్బకు ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం అదిరిపడాలన్నారు. ఒకే ఇంటిలో 43 దొంగ ఓట్లు రాయించారని, మొత్తం కలిపి వేల సంఖ్యలో దొంగ ఓట్లు నమోదు చేయించారని ఆరోపించారు. దొంగ ఓట్లు పడకుండా చూడాలని కార్యకర్తలకు సూచించారు. ఎస్‌పిఆర్ హిల్స్‌లోని వాటర్ రిజర్వాయర్ మాగంటి గోపీనాథ్ పేరు పెట్టాలని, రిజర్వాయర్ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారని చెప్పారు.ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని, ఈ ఉప ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి, కెసిఆర్‌తో కలిసి నిధులు రాబట్టుకోవడంలో ఆయన పాత్ర గొప్పదన్నారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సచ్చిపోయిందన్నారు. తనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం డబ్బులు అడిగిందని ఆరోపించారు. మాగంటి సునీత గోపీనాథ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అంటేనే మాగంటి గోపీనాథ్ అని, ఇంతమంది కుటుంబ సభ్యులను తనకు అండగా ఉంచి ఆయన దివంగతులయ్యారని, అండగా ఉండి తనను గెలిపించాలని కోరారు.

మహిళలను మోసగించి రూ.18 కోట్లతో పరారీ

- సంగారెడ్డి ఎస్‌పిని ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తక్కువ ధరకు బంగారం ఇస్తానని మహిళలను నమ్మించి రూ.18కోట్లు వసూలు చేయడమే కాకుండా డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు దాడులు చేయడంతో బాధితులు సోమవారం జిల్లా ఎస్‌పిని కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన విద్య.. ఎపికి చెందిన ఓ ఎమ్మెల్యే పేరు చెప్పి.. తక్కువ ధరకు బంగారం, ఇచ్చిన డబ్బుకు రెట్టింపు ఇస్తానంటూ మహిళలకు మాయమాటలు చెప్పి దాదాపు రూ.18 కోట్ల వరకు వసూలు చేసింది. మాజీ ఎమ్మెల్యే నుంచి దాదాపు రూ.2 వేల కోట్లు వస్తున్నాయని, కంటైనర్లు కొనేందుకు డబ్బులు కావాలని వారిని నమ్మించింది. తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేయడంతో.. వారిపై తన మనుషులతో దారుణంగా దాడి చేయించింది. ఈ దాడిలో ఒకరికి తీవ్ర గాయాలయిన ఘటన ఈ నెల 9న వెలుగు చూసింది. తమకు న్యాయం చేయాలంటూ సంగారెడ్డి జిల్లా ఎస్‌పి కార్యాలయానికి విద్య బాధితులు వచ్చి.. పటాన్‌చెరు పోలీసులు పట్టించుకోవడం లేదని ఎస్‌పి పరితోష్ పంకజ్‌కి ఫిర్యాదు చేశారు. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని మోసం చేసిందని, డబ్బులు అడిగితే ఈ నెల 9న ఇంటికి పిలిచి తన అనుచరులతో విద్య దాడి చేయించిందని తెలిపారు. పోలీసులు నిందితులు కొందరిని పట్టుకుని వదిలేశారని బాధితులు ఆరోపించారు. ప్రేమ పేరుతోనూ అనేకమందిని విద్య మోసం చేసినట్టు కూడా ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఎపిలోని ఓ ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ పోలీసులు, డాక్టర్లు, వ్యాపారస్తులే లక్ష్యంగా డబ్బులు వసూలు చేసిందని, తమకు న్యాయం చేయాలని ఎస్‌పికి బాధితులు మొరపెట్టుకున్నారు. తమ డబ్బులు తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని ఎస్‌పిని వేడుకున్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగం

- నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్ల నమోదు
- ఎన్నికల సంఘానికి కెటిఆర్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. దొంగ ఓట్ల నమోదు, కాంగ్రెస్ అధికార దుర్వినియోగంపై పార్టీ సీనియర్ నేతలతో కలిసి సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయస్థాయిలో ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ ఓటు చోరీ ఉద్యమం చేస్తుంటే... ఇక్కడ మాత్రం చోరీ ఓట్లతో గెలవడానికి కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒకే ఇంట్లో 50 దొంగ ఓట్లను నమోదు చేసిన ఘటనపై ఆధారాలను ఎన్నికల సంఘానికి సమర్పించినట్టు తెలిపారు. మొత్తం నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ 20వేలకు పైగా దొంగ ఓట్లను నమోదు చేయించిందని ఆరోపించారు. ఒక్కో వ్యక్తికి మూడు ఎన్నికల గుర్తింపు కార్డులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇష్టా రాజ్యంగా నిధులు వెచ్చించి ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ప్రజలకు తాయిలాలు అందిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రులందరూ జూబ్లీహిల్స్‌కు మకాం మార్చి ప్రజలను ప్రలోభ పెడుతున్నారని విమర్శించారు. దొంగ ఓట్లతో పాటు అధికార దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ చీరాల వారి కోర్టులో
O.S.NO.487/2022
Between :
పచ్చిపులుసు మానస సురేంద్ర మరియు ఇంకొకరు ...వాదులు
మరియు
పచ్చిపులుసు ఉమాదేవి మరియు ఇతరులు
నోటీసు
To
డి8:
మద్దు శైలజ, W/o. మద్దు శ్రీ కృష్ణగుప్త, R/o ప్లాట్ నెంబర్ -1, హౌస్ నెంబర్ 3-1&3-1/P రెసిడెన్షియల్ కాంప్లెక్స్, నియర్ బై అపార్ట్‌మెంట్, సెకండ్ ఫ్లోర్, బాచుపల్లి, హైదరాబాద్, తెలంగాణ -500090.
వాదులు, మీ మీద మరియు ఇతర ప్రతివాదుల మీద ప్లైంట్ షెడ్యూల్ ఆస్తుల భాగ పంపిణీ కోరుతూ పై నంబర్ కేసును దాఖలు చేసి ఉన్నారు. పై కేసులో 8వ ప్రతివాది అయిన మీకు ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా సమన్‌లు అందించుటకు శ్రీ కోర్టు వారు ఆర్డర్ వేసి ఉన్నారు. పై కేసును శ్రీ కోర్టు వారు తేదీ. 23-10-2025న వాయిదా వేసి ఉన్నారు. కావున తేదీ 23-10-2025 న ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, మీ వకీలు ద్వారా కానీ శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో శ్రీ కోర్టు వారు మీ పరోక్షం నందు కేసును తీర్మానం చేయుదురు.
ఇట్లు
సం/- శ్రీ ఆసాది సతీషరెడ్డి గారు
వాదుల తరుపు అడ్వకేటు,
చీరాల, బాపట్ల జిల్లా,
సెల్ నెం.7207775356

రూ.251 కోట్లతో సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి

- శాశ్వత అభివృద్ధి పనులతో సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నాణ్యతతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.251 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారానికి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం చేరుకున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ దనసరి సీతక్క, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్‌కి జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర, ఎస్‌పి శబరిష్, ఐటిడిఎ పిఒ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేడారంలో సమ్మక్క-సారలమ్మ

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఆలయ అభివృద్ధి పనులను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి, సీతక్క మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ 90 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. ఒకే సమయంలో గుడి నిర్మాణం, జాతర పనుల నిర్వహణ చేయాల్సి ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎంపి పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ.. గతంలో మేడారం జంపన్న వాగుపై వంతెన నిర్మాణం కేవలం 45 రోజుల్లో పూర్తి చేశారని, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

విజయవంతంగా పూర్తి చేస్తాం : మంత్రి పొంగులేటి

అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 2026 జనవరిలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతుందని తెలిపారు. దేవతల సందర్శనార్థం వచ్చే యాత్రికులకు ఎలాంటి లోటు పాట్లు జరగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మహా జాతర సమీపిస్తున్న నేపథ్యంలో సమ్మక్క-సారలమ్మ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి పనులను 90 రోజులలో పూర్తిచేసేలా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటికే గద్దెల ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడం కోసం రూ.101 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మరో రూ.71 కోట్ల పనుల కోసం టెండర్లు పిలిచామని అన్నారు. సమ్మక్క సారలమ్మ దీవెనలతో మహా జాతరను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. 2024లో జరిగిన జాతరకు విచ్చేసిన యాత్రికుల సంఖ్య కంటే 2026 జనవరిలో జరిగే మహా జాతరకు వచ్చే యాత్రికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఒ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇఎన్‌సి, ఆర్‌డిఒ వెంకటేష్, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్చర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి : మండలి వెంకన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటా రూ.2,400 చొప్పున కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకెఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండలి వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొక్కజొన్న ప్రధాన పంటగా ఏడు లక్షల పైచిలుకు ఎకరాలలో సాగవుతుందని, 13 లక్షల టన్నుల పైగా పంట దిగుబడి వస్తుందని తెలిపారు. మార్కెట్లో దళారీలు, ప్రయివేటు వర్తకులు మొక్కజొన్న పంటకు రూ.1600కు మించి రేటు పెట్టడం లేదని, గిట్టుబాటు కాక రైతాంగం ఆందోళన చెందుతుందని వాపోయారు. భారీ వర్షాలకు ఆరబెట్టిన పంట తడిసి ముద్దయిన కారణంగా రైతాంగం దిక్కుతోచని పరిస్థితిలోకి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గింజ కూడా కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన హామీ బుట్టదాఖలైందని విమర్శించారు.

ఎయిర్‌పోర్టులో టిమ్ హార్టన్స్ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : నగరంలోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అరైవల్స్ ప్రాంతంలో తన 41వ అవుట్‌లెట్‌ను ప్రారంభించినట్లు టిమ్ హార్టన్స్ ఇండియా తెలిపింది. ఇది హైదరాబాద్‌లో తమకు మూడో స్టోర్ అని పేర్కొంది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులు, విమానయాన సిబ్బందికి సేవలు అందించడానికి వ్యూహాత్మకంగా దీన్ని ఏర్పాటు చేశామన్నారు. తమ ప్రత్యేక సిగ్నేచర్ పానీయాలు, తాజా ఆహార ఎంపికలు, బేక్డ్ ఫేవరెట్‌లు ఇక్కడ లభిస్తాయని ఆ సంస్థ సిఇఒ తరుణ్ జైన్ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొనడంతో

- మూడేళ్ల చిన్నారి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రాలీ ఆటో ఢీకొని చిన్నారికి గాయాలు కాగా.. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. మళ్లీ స్పృహ తప్పడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ విషాద ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ శివకుమార్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం అచ్చంపేట్ గ్రామానికి చెందిన మేదరి మధురశ్రీ (3) ఇంటి ముందర కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన ట్రాలీ ఆటోలో ఇంటికి వస్తుండగా..

మధురశ్రీ ఆకస్మాత్తుగా పరిగెత్తుకుంటూ వచ్చి ట్రాలీ ఆటో కింద పడింది. ఆటో వెనుక చక్రం బాలిక కాలు మీద నుంచి వెళ్లడంతో ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి చికిత్స చేసి.. మందులు రాసిచ్చి ఇంటికి పంపారు. ఇంటి వద్ద సంబంధిత వైద్యులు రాసిచ్చిన సిరప్ తాగించిన అనంతరం బాలిక స్పృహ కోల్పోయింది. వెంటనే కుటుంబ సభ్యులు మళ్లీ ఎల్లారెడ్డిలోని అదే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి చిన్నారి అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. బాలిక తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాలిక మృతిచెందడంతో ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఘనపూర్ ఆనకట్ట దిగువ భాగంలోని మంజీరా నదిలో చేపల వేటకు వెళ్లి నదిలో పడి యువకుడు గల్లంతైన సంఘటన సోమవారం జరిగింది. కొల్చారం పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామానికి చెందిన బుడ్డెన్నోళ్ల సురేష్ (23) సోమవారం సాయంత్రం మంజీరా ప్రవాహం తగ్గడంతో ఆనకట్ట దిగువ భాగంలోని నది పాయలో చేపలు పట్టడానికి వెళ్ళాడు. అదుపుతప్పి నదిలో పడి గల్లంతయ్యాడు. వెంటనే స్థానిక జాలర్లు కొల్చారం పోలీసులకు సమాచారం అందించడంతో కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మొయినుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకొని ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

జువైనల్ హోంలో దారుణం..

- ఆరుగురు బాలురపై పర్యవేక్షకుడి లైంగికదాడి !

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సైదాబాద్ జువైనల్ హోమ్‌లో దారుణ ఘటన వెలుగుజూసింది. చిన్నారులను సంరక్షించాల్సిన పర్యవేక్షకుడే కామాంధుడిగా మారి ఆరుగురు బాలురపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం ప్రకారం.. దసరా సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన ఓ బాలుడు తిరిగి జువైనల్ హోమ్‌కు వెళ్లనని ఏడుస్తూ నిరాకరించాడు. దాంతో తల్లి అనుమానంతో ఆరా తీయగా షాకింగ్ విషయాలు బయటపడ్డాయి.

పర్యవేక్షకుడు తనపై అసహజ రీతిలో ప్రవర్తించినట్టు బాలుడు తెలిపాడు. తల్లి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు ప్రారంభించారు. మరో ఐదుగురిపైనా హోమ్ పర్యవేక్షకుడు లైంగికదాడికి ఒడిగట్టినట్టు విచారణలో తేలింది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనపై బాలల హక్కుల సంఘం కూడా సీరియస్‌గా తీసుకుని నివేదిక కోరినట్టు తెలిసింది.

ఉప ఎన్నికకు మొదలైన నామినేషన్ల పర్వం

- మొదటిరోజు 10 మంది అభ్యర్థుల నామినేషన్
- 21వరకు నామినేషన్లు స్వీకరణ, 22న పరిశీలన
- నోటిఫికేషన్ విడుదల

ఐక్యతను తెలుపుతున్న తెలంగాణ ఉద్యమకారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల పర్వం మొదలైంది. సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో మొదటిరోజు 10 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో నిరుద్యోగుల నుంచి పెద్దమొత్తంలో నామినేషన్లు దాఖలు చేస్తామని రాష్ట్ర నిరుద్యోగ జెఎసి ఛైర్మెన్ కందరపల్లి కాశీనాథ్ ప్రకటించారు. మరోవైపు ఉద్యమకారులను విస్మరించిన పార్టీలకు ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతామంటూ టియు జెఏసి రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు హెచ్చరించారు. ఉద్యోగ నియామకాల్లో ఎస్సిల్లోని 58 కులాలకు తీరని అన్యాయం జరిగిందని, అందుకే జిల్లాల వారీగా 200 మంది మాలలు నామినేషన్లు వేస్తారని ఆ సంఘానికి చెందిన నేతలు తెలిపారు. ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 03.00 గంటల వరకు పలువురు నామినేషన్లను దాఖలు చేయగా రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం స్వీకరించారు. అందులో రెండు రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు కాగా, 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. తెలంగాణా పునర్ నిర్మాణ సమితి తరుపున పూస శ్రీనివాస్, నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్‌రెడ్డి, చలిక చంద్రశేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్‌రెడ్డి, ఇబ్రహీం ఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్ ఖాన్ నామినేషన్‌లు దాఖలు చేశారు.

జిల్లా ఎన్నికల అధికారి సందర్శన

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కావడంతో షేక్‌పేట తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ సందర్శించారు. 'ఆర్ఒ, ఎఆర్ఒలతో సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా 'ఇసిఐ' నిబంధనలకు లోబడి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, నామినేషన్‌ల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేస్తామని తెలిపారు.

24 వరకు సమయం

ఉప ఎన్నికల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో 21వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 22న నామినేషన్లను పరిశీలన, నామినేషన్లు ఉపసంహరణకు ఈ నెల 24వరకు సమయం ఉంది. నవంబర్ 11న పోలింగ్, 14న కౌంటింగ్ జరగనుంది. 16న ఎన్నికల ప్రక్రియ పూర్తి స్థాయిలో ముగియనుంది. ఈనెల 21 వరకు నామినేషన్లకు అవకాశం ఉండటంతో పెద్దఎత్తున దాఖలయ్యే అవకాశముందని జిహెచ్‌ఎంసి అధికారులు అంచనా వేస్తున్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తాం : ఉద్యమకారులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి ఉద్యమకారులుగా తగిన బుద్ధి చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తామని తెలంగాణ ఉద్యమకారులు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ డెమొక్రటిక్ ఫ్రంట్, తెలంగాణ ఉద్యమకారుల జెఎసి ఆధ్వర్యంలో సోమవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు సుద్దమళ్ళ వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ ఉద్యమ సంఘాల నేతలు, జెఎసి ప్రతినిధులు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చని నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఉద్యమకారుల నుంచి ఉమ్మడి అభ్యర్థులను నిలబెట్టి.. ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించకుండా కెసిఆర్ ప్రభుత్వం దశాబ్ద కాలం అణచివేతకు పాల్పడిందని, నేడు కాంగ్రెస్ పార్టీ కూడా రెండేళ్లుగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ఉద్యమకారులను మభ్యపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీ కూడా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. అందుకే ఉపఎన్నికల్లో పోటీ చేసి ప్రధాన పార్టీల అభ్యర్థులను ఓడించి ఉద్యమకారుల సత్తా చాటే ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఈ సమాలోచన సదస్సులో టియు జెఏసి రాష్ట్ర అధ్యక్షులు ప్రఫుల్ రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్, మోహన్ బైరాగి, అంసోల్ లక్ష్మణ్, నాగుల శ్రీనివాస్ యాదవ్, ప్రజ్యోత్ కుమార్, సుజి, లావణ్య, జానకి రెడ్డి, సుచరిత, 1969 ఉద్యమకారులు బోయపల్లి రంగారెడ్డి, శంకర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగుల్లో అత్యధికం 50 ఏళ్ల లోపువారే

- టాటా ఎఐజి సర్వే

ముంబయి : హృద్రోగుల్లో అత్యధిక శాతం మంది 50 ఏళ్ల లోపువారేనని టాటా ఎఐజి సర్వేలో వెల్లడయ్యింది. దిగ్గజ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల్లో ఒకటైన టాటా ఎఐజి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, దేశవ్యాప్తంగా 300 మంది కార్డియాలజిస్టులతో నిర్వహించిన సర్వేలో వెల్లడైన విషయాలను ప్రకటించింది. ఆ వివరాలు.. ఛాతీ నొప్పి తొలి హెచ్చరికనే విషయాన్ని రోగులు పట్టించుకోరని 78 శాతం మంది కార్డియాలజిస్టులు పేర్కొన్నారు. దీని ప్రకారం యువ భారతీయుల్లో గుండెకు సంబంధించిన తీవ్ర సమస్యలు, ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. ప్రారంభ దశలో హెచ్చరిక సంకేతాలపై చాలా మందికి అవగాహన లేకపోవడం, ఆర్థిక సన్నద్ధత లేకపోవడం మరింత సమస్యాత్మకంగా ఉంటోంది. గుండె గణనీయంగా దెబ్బతిన్న తర్వాతే చికిత్సను ఎంచుకుంటున్నారని 60 శాతం మంది పైగా వైద్యులు తెలిపారు. అధునాతన కార్డియాక్ ట్రీట్‌మెంట్లకు ఆర్థికంగా సన్నద్ధంగా ఉన్న పేషంట్లలో 40 శాతం లోపే ఉంటారని తెలిపారు. ఒత్తిడి వల్లే 31-40 ఏళ్ల మధ్య వారు గుండె నొప్పి బారిన పడుతున్నారని వెల్లడయ్యింది.

దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రెన్ కొత్త ఆఫీసు ప్రారంభం

హైదరాబాద్ : దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రెన్ (డిఎఫ్‌జిసి) హైదరాబాద్‌లో తన కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. సోమవారం దీనిని ఆ దివీస్ లాబరేటరీస్ లిమిటెడ్ ఛైర్మన్ డాక్టర్ మురళి డివి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎఫ్‌జిసి కొత్త లోగోను ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నీలిమ డివి ఆవిష్కరించారు. వర్ధం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పునప్రారంభించడం ద్వారా శిశు అభివృద్ధిలో తమ ఉన్నత ప్రమాణాల అంకిత భావానికి నిదర్శనమని నీలిమ పేర్కొన్నారు.

డైలీవేజ్ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి. మధు
- వేతనాల తగ్గింపునకు నిరసనగా కొనసాగుతున్న సమ్మె

వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న మధు, కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేతనాల తగ్గింపును నిరసిస్తూ కనీస వేతనం అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని హాస్టల్ వర్కర్ల రాష్ట్ర జెఎసా చైర్మన్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. 2025 సెప్టెంబర్ 12 నుంచి గిరిజన సంక్షేమ శాఖ పరిధి డైలీ వేజ్ పిఎంహెచ్ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మెలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, తక్షణమే సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఐటిడిఎ కార్యాలయాల ముందు ధర్నాలో భాగంగా సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటిడిఎ ఎదుట ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా కార్మికులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా గిరిజన సంక్షేమ శాఖలో 3,000 మంది డైలీ పిఎంహెచ్ వర్కర్లు సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించడంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలు పిఎంహెచ్‌ల నిర్వహణలో 35ఏండ్లుగా డైలీ వేజ్, పిఎంహెచ్ వర్కర్ల పాత్ర గణనీయంగా ఉందని అన్నారు. 30 సంవత్సరాలుగా జిల్లా కలెక్టర్ల గెజిట్‌ల ప్రకారం పొందుతున్న వేతనాలను 2021లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జిఒ 64 పేరుతో ఈ రాష్ట్ర ప్రభుత్వం నాగర్ కర్నూల్, ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో వేతనాలను తగ్గించడం సరికాదన్నారు. రూ.26,000 వేతనాన్ని రూ.11,700కు తగ్గించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిఒ 16లో డైలీ వేజ్ అనే పదం లేదనే పేరుతో వీరు పర్మినెంట్ కాకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడున్న జీతాలను తగ్గించి వారందరినీ ఔట్‌సోర్సింగ్‌లోకి మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. టైంస్కేల్ అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడదని తెలిపారు. తక్షణం వారి సమస్యలను పరిష్కరించకుంటే కార్మికులకు మద్దతుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గిరిజన సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణలోకి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ ఎం.పాపారావు, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎమ్‌డి దావూద్, రత్నం రాజేందర్, వర్కర్లు నాగలక్ష్మి, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, సారీ బాబు, శ్రీను, సారక్క, వెంకటలక్ష్మి, కిషన్, ప్రభాకర్, చెప్పు ప్రభాకర్, రవీందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండాల మార్పిడితో సరికొత్త జీవితం

- యశోదలో 300 పైగా రోగుల ఆత్మీయ సమ్మేళనం

హైదరాబాద్ : దేశంలో ప్రతి 10 మంది పెద్దవారిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని అంచనా. ప్రతి సంవత్సరం దాదాపు 6 లక్షల మంది కొత్త కిడ్నీ రోగులు డయాలసిస్ దశకు చేరుకుంటున్నారు. వీరిలో కేవలం ఇరవై-ముప్పై వేల మంది రోగులకు మాత్రమే కిడ్నీ మార్పిడి అందించబడుతుంది. మిగిలిన వారు డయాలసిస్‌లో ఉండి, కిడ్నీ మార్పిడి కోసం వేచి చూస్తున్నారు. యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీలో కేవలం 36 నెలల్లో 300 కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్స్‌ని విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా అవయవ దాతలు, అవయవ గ్రహీతలు, నెఫ్రాలజిస్టులు, యూరాలజిస్టులు, సహాయక సిబ్బందితో కూడిన అత్యంత నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞుల వైద్య బృందాన్ని గౌరవించడంకోసం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. అవయవ దాతలను, అవయవ గ్రహీతలను, ఇంతటి మైలురాయిని సాధ్యం చేసిన యశోద హాస్పిటల్స్ వైద్యులను ఆయన అభినందించారు.

సంక్షేమ పథకాలన్నీ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలి

- యూనియన్ (సిఐటియు) రాష్ట్ర మహాసభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభలను రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపల్ పట్టణం, మన్నెగూడలోని నీలం సంజీవరెడ్డినగర్‌లోని చలసాని వారి కల్యాణ మండపంలో ఈనెల 14,15 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రెండ్రోజుల పాటు జరిగే సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం మహాసభల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు తుర్కయంజాల్‌లో పాలడుగు భాస్కర్ పర్యటించారు. అనంతరం స్థానిక రాగన్నగూడలోని సిఐటియు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 11 గంటలకు రాగన్నగూడ మున్సిపల్ వార్డు కార్యాలయం నుంచి మహాసభ ప్రాంగణం వరకు వేలాది మంది కార్మికులతో మహా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని అన్నారు. అనంతరం జరిగే మహాసభలో మూడేళ్ల కాలంలో జరిగిన కార్యక్రమాలపై, ప్రభుత్వం కార్మిక వర్గంపై అనుసరించిన విధానాలను సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకొని ముందుకెళ్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే అనేకసార్లు మున్సిపల్ కార్మికుల సమస్యలపై విన్నవించినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. అధికారంలోకి రాకముందు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని, పనికి తగ్గ వేతనాలు ఇస్తామని కాంగ్రెస్ చేసిన వాగ్దానాలు అమలు చేసే పరిస్థితి లేదని విమర్శించారు.

సర్పంచ్ పదవి కోసం తమ్ముడిని చంపారు.. రేపు నన్నూ చంపుతారేమో..

- ఎర్ర శేఖర్ కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సర్పంచ్ కోసం తమ్ముడిని చంపారు.. రేపు నన్నూ చంపుతారేమో..' అంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని, ఇందుకు అంతా సిద్ధం అయిందని జరుగుతున్న ప్రచారంపై అనిరుధ్‌రెడ్డి స్పందించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ ఇప్పటి వరకు ఫ్యాక్షన్ రాజకీయాలు లేవన్నారు. గతంలో సర్పంచ్ పదవి కోసం సొంత తమ్ముడిని హత్య చేశారని, రేపు ఎమ్మెల్యే పదవి కోసం తనను కూడా చంపొచ్చని ఎర్ర శేఖర్‌పై హాట్ కామెంట్స్ చేశారు. ఇలాంటి వారి కోసం జెడ్ కేటగిరీ సెక్యూరిటీ అడగాలా? అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు తమను ఓడించాలని ప్రయత్నించిన వారిని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవడానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఎవరూ ఒప్పుకునే పరిస్థితి లేదన్నారు. వచ్చే వారికి గేటు వద్దకు వెళ్తే కనీసం అపాయింట్‌మెంట్ కూడా దొరకదని, కావాలనే ఇలాంటి లీకులు ఇస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకోవడంపై ముఖ్యమంత్రి, పిసిసి చీఫ్ క్లారిటీతో ఉన్నారన్నారు. కాగా ఎర్ర శేఖర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరిన విషయం విదితమే.

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి (84) అనారోగ్యకారణాలతో సోమవారం మృతిచెందారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్ (ఎన్ఎస్ఎస్) మేనేజింగ్ డైరెక్టర్ కొండా లక్ష్మారెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిజం పట్ల మక్కువతో ఆయన 1980లో స్థానిక వార్తా సంస్థ ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షునిగా కూడా లక్ష్మారెడ్డి పనిచేశారు. ఆయన రాజకీయ జీవితం మొత్తం కాంగ్రెస్‌లో సాగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి మనవడు కొండా లక్ష్మారెడ్డి. తన రాజకీయ జీవితంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎపిసిసి) ప్రతినిధి, గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్‌తో సహా వివిధ పదవులను నిర్వహించారు. కొండా లక్ష్మారెడ్డి 1983-85 మధ్యకాలంలో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు సేవలందించారు. అనంతరం 1999, 2014 పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

ఎస్ఆర్ఎస్‌పి-2కు భీంరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలి

- ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీరామ్‌సాగర్ రెండో దశకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యులు భీంరెడ్డి నరసింహారెడ్డి (బిఎన్) పేరు పెట్టాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యాలయం ఓంకార్ భవన్‌లో సోమవారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన శ్రీరామ్‌సాగర్ రెండో దశకు పేరు పెట్టడంపై స్పందించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదలైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి భీంరెడ్డి నరసింహారెడ్డి నాయకత్వం వహించారని తెలిపారు. ఆ సమయంలో పేదలకు వందలాది ఎకరాల భూములు పంచడంతోపాటు.. వారిలో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం కలిగించారని గుర్తుచేశారు. అసెంబ్లీ, పార్లమెంటు సభ్యుడిగా ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రాజకీయాలకు అతీతంగా సేవలందించారని తెలిపారు. గోదావరి జలాలను వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఎగువ మండలాలకు తరలించే లక్ష్యంతో నిరంతరం పోరాడిన భీంరెడ్డి 1996 మార్చి 6న తిరుమలగిరి ప్రగతినగర్ వద్ద శంకుస్థాపన చేశారని వివరించారు. 'గోదావరి జలాలు నా గొంతులో పడిన తరువాతనే నాకు విరమణ' అంటూ నినదించిన భీంరెడ్డి 2008 మే 9న అమరత్వం పొందారని తెలిపారు. అంతటి మహానేత పేరును శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు రెండో దశకు పెట్టాలని, రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మైదం శెట్టి రమేష్, తుడుం అనిల్‌కుమార్, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ బరిలో నిరుద్యోగులు 30 మంది నామినేషన్లు వేస్తాం

- నిరుద్యోగ జెఎసి ఛైర్మన్ కాశీనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లవుతున్నా ఉద్యోగాలు ఇవ్వడం లేదని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో ఉంటామని నిరుద్యోగ జెఎసి ఛైర్మెన్ కాశీనాథ్ ప్రకటించారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడం లేదని, ఉద్యోగ నోటిఫికేషన్ లేదని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ముందుగా ఉద్యోగ నోటిఫికేషన్ వేసి జూబ్లీహిల్స్‌లో ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో దాదాపు 1000 మంది నిరుద్యోగులతో తరలివచ్చి 30 మంది వరకు నామినేషన్‌లు వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెఎసి నేతలు భూక్య రవి కుమార్, ఆర్‌కె వున్నారు చోళ ఉన్నారు.

జనవరిలో ఐహెచ్‌డి 2026 సదస్సు

- అపోలో హాస్పిటల్స్ నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్

రోగుల భద్రత, ఆరోగ్య సంరక్షణలో కొత్త ఆవిష్కరణలు, వ్యవస్థల అభివృద్ధిని ప్రోత్సహించే ప్రపంచంలోని ప్రముఖమైన వేదికల్లో ఒకటైన అంతర్జాతీయ ఆరోగ్య చర్చ (ఇంటర్నేషనల్ హెల్త్ డైలాగ్ -ఐహెచ్‌డి) 2026 ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లు అపోలో హాస్పిటల్స్ తెలిపింది. ఈ సదస్సు 2026 జనవరి 30, 31 తేదీలలో ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొంది. ఐహెచ్‌డి 2026 థీమ్ 'గ్లోబల్ వాయిసెస్ వన్ విజన్' థీమ్‌తో అంటే సాంకేతికతతో కూడిన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను నిర్మించే లక్ష్యంతో దీన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ సదస్సు అన్ని రంగాలలో అత్యుత్తమ ప్రమాణాలు సాధించే అంశాలపై సదస్సు దృష్టి పెడుతుందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి తెలిపారు. ఇక్కడ వైద్యులు (క్లినిషియన్లు), కొత్త ఆవిష్కరణలు చేసేవారు (ఇన్నోవేటర్లు), విధానాలు రూపొందించేవారు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచేవారు అంతా ఒకచోట చేరి, ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును రూపొందించనున్నారన్నారు.

ఎఫ్ఐపి ఓపెన్ పాడెల్ టోర్నమెంట్‌లో స్పెయిన్ హవా

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగరంలో జరిగిన ఎఫ్ఐపి సిల్వర్ రాధా టిఎంటి ఇండియన్ ఓపెన్ పాడెల్ టోర్నమెంట్‌లో మహిళల, పురుషుల విభాగాల్లో స్పెయిన్ క్రీడాకారులు టైటిల్స్ గెలిచి సత్తా చాటారు. మహిళల విభాగంలో లూసియా మాన్సిలో అలార్జా, లూసియా లుజాన్ రోడ్రిగ్జ్ జోడీ, పురుషుల విభాగంలో జి ఫిగెరోలా శాంటియాగో, ఆర్.బెల్మాంట్ పాస్టర్ ద్వయం విజేతలుగా నిలిచారు. విజేతలకు రాష్ట్ర ఐటి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పతకాలను అందించారు.